జీవితంలో ఎదురయే సంభాషణల్లో, ఏదైనా ఒక వాక్యం
గుండెని తాకుతుంది. చిన్నదో, పెద్దదో గాయం చేస్తుంది.
తనని కథగా మలచే వరకూ పూరుకోదు, మానదు.
అలాగ పుట్టిందే ఈ కథ.

శైలజ చందు

# 11 అమృతం

చంద్ర





వల్లికి ప్రయాణాలు, కొత్త ప్రదేశాలు చూడటం చాలా ఇష్టం. నాకేమో, ఇల్లు కదలకుండా, బద్ధకంగా గడపడమే బాగుంటుంది. ఎక్కడైనా, భార్యల మాటే చెల్లుబడి అవుతుంది కాబట్టి, మాకెప్పుడు సెలవలు వచ్చినా, ఊళ్లమీద పడి పోతుంటాం. ఓసారి పట్టుబట్టి, జలపాతం చూద్దామని తీసుకెళ్లింది. జలపాతం చూస్తుంటే ఏమిటో తెలియని దిగులు అనిపించింది. ఏమిటీ నీళ్ల ఆలోచన లేని పరుగు.

నీళ్లకి ఆలోచనలు వుంటాయా?

ఆలోచన లేని పరుగులు. గమ్యం లేని పరుగులు.

*

నల్లని నయాగరా.

"ఇంత పెద్ద జడా? అమ్మావాళ్లలాగా చిన్న సవరం పెట్టుకో వచ్చు కదా."

"అలవాటైపోయింది చిన్నప్పట్నుండి," అంటూ నవ్వి, నా బుగ్గ పట్టుకుంది, అత్త.

తర్వాతి రోజు, అత్త పెరట్లో సన్నజాజి పందిరి కింద తల దువ్వుకుంటుంటే చూశాను ఆమె పొడుగాటి జుట్టు.

"నిన్న సవరం అని చెప్పావ్," అని నిలదీశాను.

"నిన్న సవరమే, ఇవ్వాళే పెరిగింది," అని మళ్లీ బుగ్గ పట్టుకుంది.

ఎంత బాగుంది, అత్త బుగ్గ పట్టుకుంటే.

*

ప్రతి వేసవిలోనూ, అమ్మమ్మవాళ్ల ఇంటిముందు తాటాకుల పందిరి వేసేవాళ్లు. సెలవలకి పిల్లలు వస్తారని. దానికితోడు, ప్రతీ వేసవిలోనూ, ఎవరిదో ఒకరి పెళ్లి తప్పనిసరిగా వుండేది. పెళ్లి ఉంటే, మాకందరికి భలే సరదా. మేము పెళ్లివాళ్లింటికి వెళ్లడం, వాళ్లు మా ఇంటికి రావడం, భోజనాలు, హడావుడి, పెద్దవాళ్ల అజమాయిషీ లేకపోవడం.

ఈసారి వేసవికి ఎవరి పెళ్లీ వుండదేమోనని, పిల్లలం నిరాశ పడుతుంటే, హఠాత్తుగా మా జగ్గారావు మావయ్య పెళ్లి తోసుకొచ్చింది.

మా జగ్గారావు మావయ్య చాలా అందంగా ఉంటాడని, మా వూళ్లో వేసే నాటకాలన్నింటిలోనూ, హీరోగా, మావయ్యనే పెట్టేవాళ్లు. పక్కనే ఉన్న హైస్కూల్లో పంతులుగా పనిచేసేవాడు. మా ఇళ్లలో ఆడాళ్లు పంతులమ్మలు, మగాళ్లు పంతులయ్యలుగానూ ఉద్యోగాలు చేసేవాళ్లు.

పల్లెటూరి అందగాడు, నాటకాలు వేస్తాడు, మీరూహించిన అవలక్షణాలన్నీ ఉన్నవాడు, పెళ్లి ఎందుకో వాయిదా వేస్తుండేవాడు. మా మావయ్య వేసే నాటకాల్లో హీరోయిన్, అరుంధతి అనే ఆవిడని పెళ్లి చేసుకోవాలని మా మావయ్యకి ఉండే దనుకుంటా. కానీ ఆ కబురు మా తాతతో చెప్తే కాళ్లిరగ్గొడతాడని భయం. కులం పట్టింపా అంటే అదీకాదు. మా తాతకు అన్నీ కమ్యూనిష్టు భావాలే. ఆ తాటాకుల పందిరి కింద, తన నలుగురి పిల్లలకు కోరుకున్న వాళ్లతో కులాంతర కమ్యూనిష్టు పెళ్లిళ్లే జరిపాడు.

మరి ఇంకేంటి అంటారా? కారణం ఉంది, అరుంధతికి అప్పటికే పెళ్లయింది. మా మావయ్య కన్నా వయసులో పెద్దది.

భర్త పెళ్లయిన సంవత్సరానికి, వూరొదిలి వెళ్లాడు. ఇంకా రాలేదు. ఇంక రాడేమో!

*

ఒకరోజు, ఓ పెద్దాయన, కారులో మా ఇంటికొచ్చాడు. మేము కారు చుట్టూ మూగి వింత చూస్తుంటే, ఆయన మా తాతతో చాలాసేపు మాట్లాడాడు. తర్వాత తెలిసింది. ఆయన పాలెం జమీందారు అనీ, మా తాత చిన్నప్పటి స్నేహితుడనీ. ఆయనకు ఇద్దరే కూతుళ్లు. కూతుళ్లిద్దరినీ, మద్రాసు సంగీతం కాలేజీలో చదివిస్తున్నాడు. చిన్నకూతురు ఆయనకి చెప్పకుండా, ముందూ వెనకా ఎవరూ లేని వాడినెవడినో ప్రేమించి, రిజిష్టరు పెళ్లి చేసుకుంది. ఆ చేసుకున్నవాడు, పెళ్లయిన ఆర్నెల్లకు, కొండమీద గుడికి తీసుకెళ్లాడు. ఆ అమ్మాయి కొండ మీద నుండి దూకిందో, వీడు తోసేశాడో తెలీదు కాని, వళ్లంతా గాయాలతో పడి వుంటే, చూసిన వాళ్లు హాస్పిటల్లో చేర్పించారు.

ఈయన ఆ పెళ్లి చేసుకున్న వాడిని, ఏమిటీ అన్యాయం అంటే, 'మీ పిల్లకు మెంటల్, కావాలని దూకింది. ప్రమాదవశాత్తు పడితే వైద్యం చేయిస్తాను కాని, తనంతట తాను దూకింది కాబట్టి, నాకు సంబంధం లే'దన్నాడు. ఆ అమ్మాయి, మూడోరోజున చనిపోయింది.

అందుకని, పెద్దమ్మాయిని తెలిసిన, పెద్దకుటుంబంలో ఇద్దామని, మా తాత మీద ఉన్న నమ్మకంతో సంబంధం మాట్లాడటానికి వచ్చాడు. చిన్నకూతురి విషయం చెప్పి, కంటతడి పెట్టుకున్నాడు. మా తాత కూడా సంగతంతా విని, ఎంతో బాధ పడ్డాడు. పాలెం జమీందారుకి మాట ఇచ్చేశాడు, మా జగ్గారావుకీ, మీ అమ్మాయికి మా ఇంట్లోనే కాగితాల పెళ్లి అని.

మా తాత, జగ్గారావు మావయ్యని కూర్చోబెట్టి విషయం అంతా చెప్పాడు.

"అమ్మాయి చదువుకుంది, నాలుగేళ్ల క్రితం చూశాను. చక్కగా వుంటుంది. అమ్మాయి తండ్రి నాకు బాగా స్నేహితుడు. కొంచెం దెబ్బతిని, కష్టంలో ఉండి నీకు పిల్లనిద్దామని వచ్చాడు."

మా జగ్గారావు మావయ్యకి కాదనటానికి కారణం కనపడలేదుగానీ, మొహ మంతా కోపం చేసుకుని కూర్చున్నాడు. దిగులుగా కనపడ్డాడు.

మా తాత చాదస్తం వల్ల, మేమెప్పుడూ మామూలు పెళ్లిళ్లు చూడలేదు మా ఇంట్లో. పెళ్లికూతురు, పెళ్లికొడుకు చెరో కుర్చీలో కూర్చుంటారు. రెండు కాగితాలు చదువుతారు. చదువురాని పెళ్లికూతురైతే, మా పున్నయ్య బావ చదివి, ఆ అమ్మాయితో చెప్పిస్తాడు. ఆ అమ్మాయి నూతిలో నుండి వొస్తున్న గొంతుతో ఎవరికీ వినపడకుండా పెళ్లిప్రమాణం అయ్యిందనిపించేది.

పెళ్లిరోజున, కొద్దిగా చీకటి పడుతుండగా, కార్లో వచ్చింది పెళ్లికూతురు. అప్పటివరకు, సినిమాల్లో ఆడవాళ్లే అందంగా వుంటారనుకునేవాడిని, నేనే కాదు, ఆమెను చూసి అందరూ చూసి ఆశ్చర్యపడ్డారు. లేత గంధంరంగు పట్టుచీర, ఆమె వంటి రంగులో కలిసిపోతూ ఉంది. ఎంత చక్కటి జడ! దాదాపు మోకాళ్ల వరకూ ఉంది. పక్కనే కుర్చీలో కూర్చున్న మా జగ్గారావు మావయ్య తేలిపోయాడు, అందంలో.

అందరు పెళ్లికూతుళ్ల మాదిరిగా, కళ్లూ, తల వాలేసి కూర్చోకుండా, మామూలుగా చూస్తూ ఉంది. తలలో మల్లెలు, కొంచం ముందుకు పడి, మేమూ అందంగానే ఉంటామని చెప్పటానికి ఆదుర్దా పడుతూ వూగుతున్నాయి.

అబ్బా ఏమిటంత చక్కదనం!

పౌడర్లు, కంటినిండా కాటుకలతో, రంగు రంగు చీరల్తో, మిగతా ఆడ వాళ్లంతా లంకిణి అక్కచెల్లెళ్లలాగా ఉన్నారు. చిన్న బొట్టు తప్ప, ఏమీ అలంకారాలు లేవు. పెద్దగా నగలూ పెట్టుకోలేదు. ఆమెకు ఆమే అలంకారంగా ఉంది. మా జగ్గారావు మాత్రం ఇంతోటి అందగత్తెలని, అప్పటికి ఓ వెయ్యిమందిని చూసా నన్నట్టు, చాలా నిర్లక్ష్యంగా చూస్తున్నాడు.

పెళ్లిప్రమాణపు కాగితం తీసుకుని ఆమెతో చెప్పించటానికి మా పున్నయ్య బావ వురికి వచ్చాడు, "అమ్మాయ్, నేను చెప్పినట్లు చెప్పమ్మా," అంటూ.

ఆయన చేతిలో నుండి కాగితం తీసుకుని తనే, నెమ్మదిగా స్పష్టంగా చదివింది. మొదటిసారి మాకందరికీ, పెళ్లికూతురి గొంతు వినపడింది.

దండలు మార్చుకున్న తర్వాత, అమ్మమ్మ హారతి ఇచ్చింది. ముత్తైదువలని ఎవరినైనా పాట పాడమని అడిగింది. ఎవరికివారే పక్కవాళ్లని పాడమని బలవంతం చేస్తున్నారు. ఎవరో సరదాకి అన్నట్టు, 'పెళ్లికూతురు సంగీతం చదువుకుందిగా,

పాడమంటే సరి,' అని నవ్వారు. పెళ్లికూతురి వదినను కుంటూ, 'అవును, మా శారద బాగా పాడుతుంది, పాడరాదూ శారదా,' అంది. ఎక్కువ బతిమాలించుకోకుండానే పాట పాడింది. 'చందన చర్చిత నీల కళేబర...' జయదేవుని అష్టపది పాడింది. పాట పాడే సమయంలో, మా జగ్గారావు మావయ్య లేచి అవతలకు వెళ్లిపోయాడు, ఇక తతంగం అయిపోయిందన్నట్టు.

*

క్రితం సంవత్సరం మా రాముడు మావయ్య పెళ్లైందా! పెళ్లైన రోజు నుండీ, పెళ్లికూతురు ఏ గదిలో ఉంటే ఆ గదిలోకి పని కల్పించుకు వెళ్లి, పెళ్లికూతురి పక్కన ఎవరుంటే వాళ్లతో అక్కరలేని సోది మాట్లాడేవాడు.

కానీ, జగ్గారావు మావయ్య పెళ్లయిన తర్వాత కూడా సంతోషంగా లేడు. పెళ్లికూతురిని తప్పించుకుని తిరుగుతున్నాడు. ఎవరైనా పెళ్లి తాలూకు వేళాకోళా లాడబోతే చిరాకుపడేవాడు. మా అమ్మమ్మ అది గమనించి, మా శారదత్తని కాఫీ ఇవ్వమనో, మంచినీళ్లు ఇవ్వమనో జగ్గారావు మావయ్య దగ్గరకు పంపేది.

నాలుగోరోజు, మరి అది అమ్మమ్మ పథకమో, యాదృచ్ఛికమో తెలియదు కానీ, "ఈ బిందెతో నీళ్లు తీసుకురా అమ్మా," అంది మా అత్తతో.

"ఒరేయ్, అత్తని బావి దగ్గరికి తీసుకెళ్లు," అని నన్ను కూడా పంపింది. ఆ సమయానికే మా జగ్గారావు మావయ్య, స్నానానికి బావి దగ్గరకు వచ్చాడు. బిందె నూతి చప్టా మీద పెట్టి మాట్టాడకుండా నించుంది అత్త.

నేనే రాయబారం.

"మావయ్యా, మాకు బిందెలో నీళ్లు పొయ్యి."

మావయ్య బకెట్‌తో నీళ్లు తోడి బిందెలో పోశాడు. బిందె నడుము మీద పెట్టుకుని వెళ్లబోతోంటే, 'మావయ్యతో మాట్టాడవే,' అన్నాను అరిందాలా. ఏమీ మాట్టాడకుండా, తన బంగారువేళ్లు నీళ్లలో ముంచి నా మీద చిలకరించింది. నేను నవ్వుతూ తప్పించుకుంటే, ఆ నీళ్లు మావయ్యమీద పడ్డాయి. మావయ్యే మాట్టాడాడు.

"ఒక్కమాట, ఏమీ అనుకోకపోతే."

మావయ్య ఏదో చెప్పబోతున్నాడని వినడానికి అక్కడే నుంచుంది. అప్పటికే అత్త బుగ్గలు ఎర్రబడ్డాయి. ఒక్క నిముషం ఆగి నెమ్మదిగా అన్నాడు.

"ఇలాంటి పనులు ఎప్పుడూ చెయ్యొద్దు. నాకు ఇష్టం ఉండదు."

అత్త బిందె ఎత్తుకుని ఎలా నడిచి ఇంట్లోకి వెళ్లిందో!

ఏం జరిగిందో నేనే, అమ్మమ్మకి చెప్పాను. ఎవరికీ అనుమానం రాకుండా, మామూలుగా ఉండడానికి అత్త ఎంత ప్రయత్నం చేసినా ఇంట్లో అందరికీ తెలిసింది.

ఎప్పుడు చూసినా, చేతిలో ఆర్నెల్ల బిడ్డ, మూణ్ణెల్ల వేవిళ్లతో సతమతమయ్యే మా మీనాక్షి పిన్ని, "అబ్బ, వినటానికే చీదర వేస్తుంది, పెళ్లయి మూడురోజులైనా కాలేదు, అంత ఎగబడాలా," అంటూ అమితాశ్చర్యం వ్యక్తం చేసింది.

ఆ తర్వాత మేమెప్పుడు చూసినా వాళ్లిద్దరూ, భార్యాభర్తలలా మసిలినట్టే ఉండేది కాదు. మా జగ్గారావు మావయ్య రోజూ రాత్రి వొంటిగంట తర్వాతే వచ్చేవాడు. ఇంటి బయట మంచం, పరుపూ, దోమతెరా వేసుకుని నిద్ర పోయేవాడు.

అమ్మమ్మ, "ఎక్కడికి పోతావురా అంతసేపు రాత్రిపూట," అని అడిగితే, "నేనెక్కడికి పోతాను?" అని ఎదురు ప్రశ్నించి, "స్నేహితులతో మాట్లాడుతుంటే ఆలస్యమయింది," అనేవాడు.

"అంత రాత్రిపూటదాకా మాట్లాడే స్నేహితులెవరురా నీకు?"

"అబ్బ కొంపకొస్తే ప్రాణాలు తీస్తున్నావ్," అని అమ్మమ్మని విసుక్కునేవాడు.

శారదత్త వాళ్ల నాన్న, ఊరి చివర నాలుగెకరాల పొలం కొని, పెద్ద బంగళా కట్టిస్తానంటే, అత్త చిన్న ఇల్లు చాలంది. దక్షిణం వేపు రెండెకరాలు, మల్లెతోట వేయించింది. తూర్పువేపు స్థలంలో కూరగాయలు పండించేవాళ్లు. ఇప్పటికి కూడా, నేను చూసిన ఇళ్లన్నింటిలోనూ అదే అందమైన ఇల్లు.

*

చాలా సినిమాల్లో, హీరో ఒకావిడని ప్రేమిస్తాడు, ఎందుకో ఆవిడని పెళ్లి చేసుకోలేక ఇంకొకావిడని చేసుకుంటాడు. మొదటామె కళ్లనీళ్లు పెట్టుకుని వెళ్లిపోతుంది. నాకు హీరో మీద జాలేసేది. పాపం వీడు ఈ రెండో పిల్లతో ఎలా కాపురం చేస్తాడో, మనసు లేకుండా అని. నాలుగు సీనులయ్యింతర్వాత ఈ రెండో పిల్లలో, పెద్ద కళ్లో, పెద్ద బొట్టో ఏదో బాగా నచ్చేసి, తర్వాతి సీన్లో, మూడు మాసాలో ఆరుమాసాలో ఆగమంటూ పాటందుకునేవాడు.

సినిమా హీరోల కన్నా నాటకాల హీరో మావయ్యే నయమనిపించాడు. మావయ్యకి అత్తలో ఏం నచ్చలేదో, ఎందుకు నచ్చలేదో ఇప్పటికీ నాకు పెద్ద మిస్టరీ. అత్త కూడా, స్కూల్లో సంగీతం టీచరుగా ఉద్యోగంలో చేరింది. పేరుకే సంగీతం టీచరు, అన్ని పాఠాలూ చెప్పేది. ఇద్దరూ ఒకే స్కూల్లో పనిచేస్తున్నా ఒక్కరోజు కూడా కలిసి వెళ్లేవాళ్లు కాదు, వొచ్చేటప్పుడు కూడా ఎవరి దారి వాళ్లదే.

అత్త స్కూల్లో చేరింతర్వాత, మగ పంతుళ్లందరికీ సోకులు, మాటల్లో మర్యాద, పనిలో శ్రద్ధ ఎక్కువైనాయి. కానీ ముందుకొచ్చి మాట్లాడటానికి భయ పడేవాళ్లు. అత్త అందమే వాళ్లని భయపెట్టేది అనుకుంటా.

*

మగవాళ్లు పేపర్లు దిద్దటానికి వేరే ఊరెళ్తే, అందరం అత్త వాళ్లింటికి వెళ్లే వాళ్లం. ఆడవాళ్లనీ, పిల్లల్నీ చేర్చి మధ్యాహ్నం ఆటలాడించేది. చార్ పట్టీ, ఏడు పెంకులాట ఆడేవాళ్లం.

'బడి పంతులు'లో అంజలీదేవిలా నెమ్మదిగా ఉండే మా అమ్మమ్మ కూడా, చిన్నపిల్లలాగా ఆటలో ఇన్వాల్వ్ అయిపోయి, 'పట్టేయ్యండ్రా ఆ సన్నాసిని, తొండి చేసి పారిపోతున్నాడు,' అంటూ కేకలేసేది.

రాత్రి ఇంటి వెనక పందిరి కింద, పెట్రోమాక్సు లైటు వెలుగులో భోజనాలు చేసేవాళ్లం. అత్త భోజనానికి పిలిస్తే తప్పకుండా ఆ పాయసం కాని పాయసం ఉండేది. అత్త పాయసంలాంటిది ఏదో చేసేది. రుచి పాయసానికి దగ్గరగా ఉంటుంది కానీ పాయసం కాదు. పలుకులెక్కువ, పాలు తక్కువ.

*

వేసవి సెలవలకి వూరు వెళ్లి, బస్ దిగగానే అత్తవాళ్లింటికి పరిగెత్తాను. అత్త ఇంట్లో లేదు. ఇంటి వెనక్కి వెళ్లి చూస్తే, మల్లెతోటలో సుబ్బులు, సుబ్బులు మొగుడుతో పాటు అత్త కూడా పనిచేస్తోంది. వడగాలి వీస్తోంది. పెరడంతా రకరకాల పూలమొక్కలు. చల్లగా పచ్చివాసన వొస్తున్న పందిరి. మట్టి అంటకుండా సిమెంట్ నేల. ముగ్గురు కూర్చోగల వెదురు వుయ్యాల, మెత్తని పరుపు ఉంది.

''అత్తా,'' అని పెద్దగా కేకేశాను. 'నేనొచ్చాను చూడు,' అన్నట్టు.

శారదత్త దాదాపు పరిగెత్తి వచ్చినంత తొందరగా వచ్చింది.

''ఇదేంట్రా ఇంత ఎండని పడి వచ్చావ్, చూడు మొహమెలా వాడిపోయిందో అని, మబ్బురంగు చీర చెంగు అక్కడే ఉన్న, నల్లరాతి నీళ్లతొట్టిలో ముంచి పిండింది. ఆ చల్లటి పైట కొంగుతో మొహం తుడిచింది. అబ్బ ఎంత హాయి!

కూర్చోబెట్టి, లోపలికి వెళ్లి జున్ను తెచ్చింది. కత్తితో కోసినా తెగనంత గట్టి జున్ను. పక్కనే ఉన్న కొడవలితో కొబ్బరి బోండాం కొట్టి, నీళ్లు తాగించింది. ఏవో కబుర్లు చెప్తూ ఉంటే నిద్ర వొచ్చింది. లేచేసరికి బాగా చీకటి పడింది. ఉయ్యాల దిగి బయటికి చూస్తే, ఆకాశమంతా నక్షత్రాలు. పక్కనే ఉన్న మల్లెతోటలో, కోయకుండా మిగిలిపోయిన మల్లె మొగ్గలు నక్షత్రాల్లాగా విచ్చుకున్నాయి.

అత్త వంట చేస్తోంది. సుబ్బులొచ్చి నాకు స్నానం చేయించింది, నాకు స్నానం చేయడం వొచ్చు అని చెప్పినాసరే. అత్త లాగూ చొక్కా తెచ్చింది. నావే అవి, ఎక్కడి నుండి వొచ్చాయి?

''మీ అమ్మ, పెద్దమ్మ, ప్రసాదు వచ్చి వెళ్లారురా, నువ్వు నిద్రపోతున్నావు. మీ అమ్మే తెచ్చింది ఇవి, నువ్వు లేస్తే స్నానం చేయించమని.''

ప్రసాదు మా పెద్దమ్మ కొడుకు. వాడికీ, నాకూ ఎప్పుడూ గొడవే. ఎప్పుడూ ఓడిస్తాడు నన్ను అన్నిటిలో. అత్త, వాడికి కూడా జున్ను పెట్టి ఉంటుందా?

ఏమో?

ఆలోచిస్తుంటే, అత్త బాదంకాయ పళ్లెంలో వేడి అన్నంలో నెయ్యి, జీలకర్ర వేసిన కంది పచ్చడి తెచ్చింది. నేను తింటూ ఉంటే తను మల్లెపూల మాల గుచ్చుతోంది.

"అత్తా, అందరు బియ్యం పండిస్తుంటే, నువ్వు మల్లెపూలు వేశావే, తోటలో?" అడిగాను.

"బియ్యం కాదు వరి. మరి నువ్వు పెద్దయిన తర్వాత, నీ పెళ్లాం పూలజడ కావాలంటే, వరి కంకుల్తో వేద్దామా?"

'పెళ్లానికి పూలజడ.'

ఆ వయసులో కూడా, ఆ మాటతో చక్కిలిగిలి పెట్టినట్టయింది.

"ఊ ఊఁ నేనేం పెళ్లి చేసుకోను," గారాలు పోయాను.

"మరి ప్రసాదు పెళ్లి చేసుకుంటే, వాడికో."

నా గోల అత్తకి అర్థం అయ్యింది.

"ప్రసాదు అంటే ఇష్టం లేదని, ఆ అమ్మాయికి వెయ్యకపోతే ఏడవదూ?" అంది.

నిజమే మరి.

గుచ్చిన మల్లెచెండు, గోడకున్న వేంకటేశ్వరస్వామి పటానికి వేసింది.

"నువ్వు పెట్టుకోవా అత్తా?"

"మల్లెలు నలిగితే నాకు బాగోదురా."

మేము మాట్లాడుకుంటుంటే మావయ్య వొచ్చాడు. అత్త, మావయ్యా ఎక్కువ మాట్లాడుకున్నట్టే ఉండరు. మావయ్య అత్తతో మాట్టాడుతుంటే, అత్తని, 'ఏమండీ,' అని పిలిచినట్లుంటుంది.

బయటి ఆడవాళ్లతో ఎలా వున్నాగానీ, మావయ్య శారదత్తతో చాలా మర్యాదగా ఉండేవాడు, ఏ భర్తా, తన భార్యతో ఉండనంత మర్యాదగా.

మావయ్యకు కూడా భోజనం పెట్టింది. భోజనం చేసినంతసేపూ, వాళ్లిద్దరి మధ్య మాటలే లేవు. తిన్న తర్వాత చేతులు కడుక్కుంటే, వడ్ల బస్తాల మీద చేయి తుడుచుకునే గుడ్డ తయారుగా వుంచింది.

మా అమ్మా నాన్నైతే, మేమందరం తిన్న తర్వాత వాళ్లిద్దరూ, కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తారు. మా నాన్న చేతులు కడుక్కుని, మా అమ్మ చీర చెంగుతోనే చేతులు తుడుచుకుంటాడు.

*

మరుసటి రోజు పిల్లలందరం పెద్ద వంతెన కాలవ దగ్గర ఈతల కోసం వెళ్లాం. వంతెనకు ఆనుకుని కాలవ వొడ్డు కొంత దూరం దాకా సిమెంటు చేశారు.

పిల్లలు ఆ సిమెంటు వొడ్డు మీద కూర్చునేవాళ్లు. అదే కుర్ర రచ్చబండ. ఊళ్లో సంగతులు మాట్లాడుకునేవాళ్లు. నన్ను వొడ్డుకి దగ్గరగా, వాళ్ల బట్టలకి కాపలా కూర్చోబెట్టారు. ఈతకి ఇంకా చిన్నోణ్ణని మా అన్నయ్య నీళ్లలోకి వొద్దన్నాడు.

"జగ్గారావుకి మెంటలేంట్రా, ఇంట్లో పెళ్లాన్నొదిలి, ఆ చేంబేడి డాన్సు పంతులమ్మ చుట్టూ తిరుగుతాడే?"

మా శంకరు అన్నాడు అన్నయ్యతో.

"ఏంటోరా, మావయ్యకు, అత్తకు మధ్య అస్సలు కెమిస్ట్రీ లేదు," అన్నయ్యది సైన్సు గ్రూపు.

అప్పుడే ఒక ఈత కొట్టి అలుపు తీర్చుకుంటున్న శీనుగాడు, "కెమిస్ట్రీ కాదురా, అసలు ఫిజిక్..."

వాడు మాట్టాడుతుంటే, 'వీడికీ మధ్య వాగుడెక్కువయ్యిందిరా,' అని అన్నయ్యా, శంకరూ వాణ్ణి నీళ్లలోకి తోసేశారు. వాడు చేపలాగా ఈదుకుంటూ పోయాడు.

*

ప్రతి వేసవిలో వూళ్లో నాటకం వేస్తారు. మేమందరం ఈత చాపలూ, దుప్పట్లూ, దిండ్లు తీసుకెళ్లేవాళ్లం నాటకం చూడటానికి. మా జగ్గారావు మావయ్యే హీరో. అత్తని కూడా రమ్మనమని గొడవ చేశాను.

'రావమ్మా, ఎప్పుడూ ఇంట్లోనే కూర్చుంటావూ,' అని పెద్దమ్మావాళ్లు బలవంతం చేశారు. అత్త నాతోపాటే కూర్చోవాలని పట్టుబట్టాను. ఆడవాళ్లు, అత్తను చూస్తూ కూర్చున్నారు. అతి లేత గులాబీరంగు సాదా చీరెలో అత్త గులాబి పూవుకన్నా బాగుంది.

స్టేజి మీద కొంత డైలాగుల నాటకం గడిచిన తర్వాత, డ్యూయెట్ మొదలయ్యింది. మా మస్తాన్‌రావు డైరెక్షనంతే మరి. మామూలు నాటకంలో, సందర్భాన్ని బట్టి, సినిమా పాటలు కలిపి నాటకమేయిస్తాడు.

'తనివి తీరలేదే, నా మనసు నిండలేదే...' అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో పాట వస్తుంటే జగ్గారావు మావయ్య, అరుంధతితో కలిసి స్టేజ్ మీద శ్రుతి మించి రొమాన్స్ చేస్తున్నాడు. ఆడవాళ్లందరూ నాటకం చూడకుండా అత్త మొహమే చూస్తున్నారు. నాటకం కన్నా, అత్త మొహంలో విచారమే బాగున్నట్టుంది.

*

మావయ్యకి పిల్లలు కలగలేదు. మాకెవరికీ ఆశ్చర్యమూ కలగలేదు. పెద్ద వాళ్లం అయ్యాం. ప్రసాదు, నేను ఎందుకు కొట్టుకునేవాళ్లమో బుర్ర బద్దలు కొట్టుకున్నా గుర్తుకురానంత పెద్దవాళ్లం! అమెరికాలో వుద్యోగం చేస్తున్నాడు వాడు.

నా చదువయ్యాక నన్ను అమెరికా రప్పించి, నాకు వుద్యోగం వచ్చేవరకూ తన దగ్గరే వుంచుకున్నాడు.

సెలవలకి ఇండియా వొచ్చాం.

ఓనాడు అత్తవాళ్లింటికెళ్లేసరికి మావయ్య బయటికి వెళ్లబోతున్నాడు.

"అత్త లేదా?"

"ఒంటిపూట బడిరా. వచ్చేస్తుంది. నువ్వు కూర్చో."

"నువ్వెక్కడికీ?"

"పొద్దున్న వెళ్లేప్పుడు గొడుగు మర్చిపోయింది," అంటూ చూరులోంచి గొడుగు తీశాడు. నేను తదేకంగా చూడడం గమనించి, "ఎండలు పెరిగాయిరా. ఇదివరకులా లేదు," అంటూ సర్దుకున్నాడు.

"బళ్లో ఇచ్చి వస్తా. నువ్వు కూర్చో," అంటూ పాత వారపత్రిక నా చేతికిచ్చాడు.

'నేనూ వస్తా,' అంటూ మావయ్యతో నడిచా. దారిలో ఏవో చెప్తున్నాడు. మావయ్య ఇదివరకులా లేడు. స్టేజి మీద ఆవిడెవరితోనో నాటకం వేసిన జగ్గారావు మావయ్యేనా అన్న అనుమానమొచ్చింది. అత్తనీ, మావయ్యనీ పెద్దయ్యాక చూస్తున్నా. వాళ్లిద్దర్నీ నా కన్ను గమనిస్తూనే వుంది. అత్తపట్ల మరింత మర్యాదగా మసలుతున్నాడు మావయ్య. వాళ్ల మధ్య దూరం, ఇక ఎప్పటికీ తరగదన్నంత మర్యాద.

*

ప్రసాదుకి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. అందరికి నచ్చిన సంబంధం, మా శారదత్తకు అక్క వరసయ్యే ఆమె కూతురు. కాకపోతే ఆ అమ్మాయికి ఓ చెల్లెలుంది. ఇద్దరికి కలిపే పెళ్లి చేద్దామని ఆ పిల్లల తండ్రి అనుకుంటుంటే ప్రసాదు నన్ను సూచించాడు, వాళ్ల కాబోయే మామగారికి.

పెద్దయిన తర్వాత కూడా వాడు నన్ను ఓడించాడు. నేనూ, వాడూ, తోడల్లుళ్ల మయ్యాం.

తిరిగి అమెరికా వెళ్లబోయే ముందు, అత్త మమ్మల్ని వాళ్లింట్లో వుండమని అడిగింది, మాకు వీలైనన్ని రోజులు. అత్త అడిగిన తీరు చూస్తే ఎందుకో నాకు అమెరికా తిరిగి వెళ్లాలనే అనిపించలేదు. మేమున్న రోజుల్లో అత్త మొహంలో కనపడిన సంతోషం ముందెప్పుడూ చూడలేదు. రకరకాల వంటలు చేసేది.

సుబ్బులుతో చెప్తోంది అత్త, "మల్లెపూలు మొగ్గలుగానే కోసెయ్యి, ఇవ్వాళ మార్కెట్‌కి వద్దు."

వల్లికి పూలజడ వేయించుకుందామని ఉన్నా, జుట్టు కత్తిరించుకుంది కనక, వేయడం కుదరదని అత్త దిగులుపడింది. వల్లి వాళ్ల అక్కకి, అంటే మా వదినగారికి మాత్రం పెద్ద జుట్టే. మధ్యాహ్నం రెండింటికి కూర్చుని, అయిదింటిదాకా, పూల

జడ కుట్టింది. ప్రసాదు, వల్లి కూడా అత్తకి సహాయం చేశారు పూలజడ కుట్టడంలో. వల్లి మాత్రం చిన్న జడ వేసుకుని, తలలో మల్లెలు తురుముకుంది.

"పిన్నీ, నువ్వు కూడా పూలు పెట్టుకో," వల్లి, అత్తతో అంది.

"ఏమో, మల్లెలు నలిగితే నాకు బాగోదు."

అందరికన్న అందమైన జుట్టు ఉంది అత్తకి. కానీ పెళ్లిరోజున చూడటమే అత్త తలలో పూలు. ఆ తర్వాత ఎప్పుడూ అత్త జడ పూలు లేక ఒంటరిగానే కనపడేది.

ఆరోజు కూడా అత్త పాయసం చేసింది. రాత్రి భోజనం అయిన తర్వాత, కూర్చోలేక, పడుకోలేక ఇబ్బంది పడుతున్నానని, ప్రసాదు కేకలేశాడు నన్ను.

"ఎన్నిసార్లు చెప్పాన్రా నీకు, రాత్రిపూట తిండి తగ్గించమని, కంట్రోల్ చేసుకోలేవూ," అని.

అత్త నన్ను వెనకేసుకొచ్చింది. "పోనీలేరా, వాడికి పాయసం అంటే ఇష్టం, పాపం."

"కొంచెం దూరం నడిచి రా," నాతో చెప్పింది.

నాతోపాటు ప్రసాదు, మావయ్య కూడా నడుస్తామని వచ్చారు. పెద్దవంతెన కాలవ వరకు వచ్చింతర్వాత ఇక నడవలేనని, మొండికేసి సిమెంటు గట్టు మీద కూర్చున్నాను. నా పక్కన ప్రసాదు, వాడి పక్కన మావయ్య. కొంచెంసేపు వూళ్లో కబుర్లు అయ్యాక, ముగ్గురం మౌనంగా కూర్చున్నాం. మౌనం ఇబ్బందిగా ఉంది.

కాలవ నీళ్లు చప్పుడు చేస్తూ అలజడిగా పరుగు తీస్తున్నాయి.

తెలియని అలజడి.

ప్రసాదు మెల్లగా అన్నాడు, "మావయ్యా!"

"ఒక మాట అడగనా?"

ఏమడగబోతున్నాడో మనసుకి తెలిసినట్టు, గుండె చప్పుడుని పెంచింది.

"అత్త ఎంత మంచిది మావయ్యా, ఆమె బతుకు ఇక అంతేనా?"

మావయ్య ఏమీ మాట్టాడకుండా ఓ నిముషం కూర్చుని అన్నాడు, "మరి నా బతుకు మాటేంటిరా?"

వళ్లు మండింది. ఏం తక్కువయ్యింది బతుక్కి? నా ఆలోచనలు చదివినట్టు ప్రసాదు నా చెయ్యి పట్టుకున్నాడు. ఆవేశంలో ఏమైనా అంటానేమోనని. మావయ్యే మళ్లీ మాట్లాడాడు.

"నీళ్లు తాగేవాడికి అమృతం ఇస్తే, అప్పుడు విలువ తెలియలేదు."

మేమిద్దరం మాట్లాడలేదు.

"ఇప్పుడు తెలుసుకునీ ప్రయోజనం లేదు. ఈ జన్మకింతే."

మావయ్య కంఠం వణికింది, నా కంటి చెమ్మని కదిలిస్తూ.

లేచి, బట్టలకంటిన గడ్డిపరకల్ని దులుపుకుని, మాకంటే ముందు నడుస్తూ బయలుదేరాడు.

*

ఇంటికొచ్చాం. అత్తతో పాట పాడించుకుంటున్నారులా వుంది అక్కా చెల్లెళ్లు. వీణ వాయిస్తూ పాడుతోంది. ఏదో తమిళం పాట. భాష తెలియకపోయినా, పాట బాగుంది.

అత్త అందం వీసమంతైనా తగ్గినట్టే లేదు. అవే బంగారపు వేళ్లు, సముద్రాల్లాంటి కళ్లు. ఎప్పటిలానే లేతరంగు చీర. చీరకు, అత్త వొంటి రంగులో కలిసిపోదామన్న ఆరాటం.

జగ్గారావు మావయ్య ఎప్పుడైనా ఆ చక్కటి వేళ్లతో ఆడుకుని వుంటాడా? నిజమే. ఇద్దరిదీ రెండు రకాల వెలితి. కానీ ఎవరికెక్కువ అన్యాయం జరిగింది? కన్నీళ్లింకిన దుఃఖం ఎవరిది?

ఆరుబయట మంచం మీద పక్కకు తిరిగి పడుకుని రాని నిద్ర నటిస్తున్నాను.

లోపలంతా సముద్రంలాగా ఉంది.

ప్రసాదు వచ్చి పక్కనే కూర్చున్నాడు, నన్ను ఆనుకుని. వాడి స్పర్శతో, నిశ్శబ్దంగా దుఃఖం ముంచుకొచ్చింది.

"ఊరుకోరా," అన్నాడు.

ఆలోచన లేని నీళ్లు కిందికి జారిపోయాయి.

*'పసిడిబొమ్మ' కథాసంపుటి*

*జులై 2022*

*



13 అక్టోబర్ 1965న తెనాలి దగ్గర చదలవాడలో పుట్టిన **శైలజ చందు** మొదటి కథ అభిమాని. 2011 నుంచి కథలు రాస్తున్న వీరు సుమారు 150 కథలు రాసారు. అష్టదిగ్గజాలు, పసిడిబొమ్మ కథాసంపుటాలు ప్రచురించారు. ప్రస్తుత నివాసం హైదరాబాద్.

*చిరునామా: 1805, అపర్ణ ఆరా, షేక్‌పేట్, హైదరాబాద్ 540 008*

*ఫోన్: 63059 88017* **sailajachandu@gmail.com**